నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, శనివారం 21 సెప్టెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

# ఏమార్చేసారు

- మాటలతో మాయచేసిన సైబర్ ముఠా
- యాప్ లోన్ల పేరుతో రూ.కోట్లు కొట్టేశారు
- గల్ఫ్‌కు వెళ్లి.. నేరాలపై అవగాహన పెంచుకొని..
- వచ్చిన డబ్బుతో ప్లాట్ల కొనుగోలు, జల్సాలు
- ఎట్టకేలకు వనపర్తిలో చిక్కిన వైనం
- బీకేర్‌ఫుల్‌గా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గల్ఫ్‌లో పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడి ఈజీగా నేరాలు చేసి సంపాదించేందుకు ఏకంగా సైబర్ ముఠాను ఏర్పరచుకున్నారు. తీగలాగితే డొంక కదిలిందన్నట్లు ఓ చిన్న సైబర్ క్రైం ఫిర్యాదు దర్యాప్తులో పోలీసులకు విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఫేక్ లోన్ యాప్‌లు సృష్టించి వాటి ద్వారా కస్టమర్లను మైమరిపించి పెద్ద మొత్తంలో డబ్బు కాజేసిన ముఠా వనపర్తి జిల్లాకు చెందిన వారే కావడం సంచలనం కలిగిస్తోంది. బీహార్‌కు చెందిన ఓ సైబర్ నేరగాడితో కుమ్మక్కై స్థానికంగా ఉండి మోసాలకు పాల్పడ్డారు. లోన్ల కోసం అప్లై చేసిన వారిని టార్గెట్ చేసి ప్లాట్లు, ఫోన్లు ఇతర ఖరీదైన వస్తువులను కొనుగోలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లోన్ యాప్స్‌పై నిఘా పెట్టి కొత్తకోటలో జరిగిన ఒక సైబర్ క్రైం ద్వారా కూపీ లాగగా, డొంకంతా కదిలింది.

***ఉలిక్కిపడ్డ ఉమ్మడి జిల్లా యంత్రాంగం..***

సైబర్ నేరాలు చేయడంలో ఉత్తరాది రాష్ట్రాలు ఆరితేరాయి. ఈజీగా ఆన్‌లైన్‌లో లింకులను పంపించి డబ్బులు కాజేయడం.. ఇతరాత్రా యాప్‌ల ద్వారా మోసంగించడం సైబర్ క్రైంలో భాగం. అయితే గతంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన కొంతమంది యువకులు ఈజీగా మనీ సంపాదించాలని ఇతర రాష్ట్రాలకు వెళ్లి సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి అక్కడి నుంచి అచ్చ తెలుగులో మాట్లాడి తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిని మోసగించేవారు. ప్రస్తుతం ఏకంగా ఉమ్మడి జిల్లాలోనే సైబర్ ముఠా తిష్ట వేయడం పోలీస్ యంత్రాంగానికి సవాల్‌గా మారింది. సైబర్ నేరస్తులు ఉపయోగించిన ఫోన్లను ట్యాప్ చేస్తే అసలు విషయం బయటపడింది. నిందితులందరినీ అదుపులోకి తీసుకొని దాదాపు రూ.కోటి వరకు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ ముఠా ఉపయోగించే ఫోన్లు, మోసం చేసిన డబ్బులతో కొన్న ప్లాట్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## కొత్తకోటలో వెలుగు చూసిన సైబర్ నేరం..

కొత్తకోటకు చెందిన కుమ్మరి రాజు ముద్ర లోన్‌కు అప్లై చేశాడు. జనవరిలో విశ్వకర్మ కింద లోన్ కావాలని ఆన్‌లైన్ ద్వారా తన పూర్తి వివరాలతో దరఖాస్తు చేశాడు. దీన్ని అడ్డం పెట్టుకొని సైబర్ నేరగాళ్లు జూలై 11న వాట్సాప్ నెంబర్‌కు పీఎం విశ్వకర్మ లోన్ మంజూరు అయినట్లు మెసేజ్ పంపారు. ఈ లోన్ కావాలంటే ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.12,250 కడితే డబ్బులిస్తామని నమ్మబలికారు. దీంతో రాజు అడిగిన డబ్బులు పంపించాడు. మళ్లీ టాక్స్ ఫీజు రూ.9వేలు కట్టాలని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన రాజు కొత్తకోట పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఈ కేసుపై విచారణ చేపట్టారు. బీహార్‌కు చెందిన రోహిత్ అనే వ్యక్తి ద్వారా ఎక్సెల్ యాప్‌తో తీసుకొని ముఠాగా ఏర్పడినట్లు గుర్తించారు. కొత్తకోట జంగమాయపల్లికి చెందిన ఓ వ్యక్తిని అనుమానించి పోలీసులు అరెస్టు చేయగా, సైబర్ ముఠా గుట్టు రట్టు చేశారు. సూత్రధారి అయిన నర్సింగ్‌నాయక్‌తోపాటు ఇస్లావత్ రాములు, రాత్లావత్ రమేశ్, కొత్తపల్లి ఉమేశ్, వీరేశ్‌తోపాటు మరో ఇద్దరు మైనర్లు ముద్ర, ధని లోన్ యాప్‌ల ద్వారా సేకరించిన కస్టమర్ల వివరాలను తెలుసుకొని నేరుగా కాల్ చేసేవారు. దీనికి సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని బీహార్‌కు చెందిన రోహిత్ అనే వ్యక్తి నుంచి సేకరించి తమ దగ్గర ఉన్న ఫోన్లను తీసుకొని వనపర్తి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెళ్లి కస్టమర్లకు ఫోన్ చేసి లోన్ మంజూరైందని నమ్మించి వారితో ఇన్సూరెన్స్, టీడీఎస్, జీఎస్టీ ఫైల్ క్లోజింగ్ చార్జెస్, ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ ఛార్జ్ అంటూ రూ.10వేల నుంచి రూ.40వేలు వసూలు చేసి లోన్ మంజూరైనట్లు ఫేక్ డాక్యుమెంట్లు పంపించి ఫోన్ స్విచాఫ్ చేసేవారు. కొట్టేసిన డబ్బులు బీహార్‌కు చెందిన రోహిత్ 50శాతం తీసుకోగా, నర్సింగ్‌నాయక్ 25శాతం, మిగతా టీం 25శాతం వాటాగా డబ్బులను పంచుకునేవారని పోలీసుల విచారణలో వెల్లడింది.






## ముద్ర, ధని లోన్ యాప్‌లతో మోసాలు..

ఆన్‌లైన్ యాప్‌లపై లోన్లు తీసుకొని మోసపోతున్న బాధితులు అధికమవుతున్నారు. దీంతో పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముద్ర, ధని యాప్‌లను సృష్టించి 'మీకు లోన్ శాంక్షన్ అయింది' అంటూ బాధితుల నుంచి ప్రాసెసింగ్ ఫీజు పేరిట రూ.10 వేల నుంచి రూ.40వేల చొప్పున కాజేశారు. ఈ క్రమంలో కొత్తకోట పోలీస్‌స్టేషన్లో నమోదైన ఒక కేసు విచారణ చేపట్టగా నిందితులు అడ్డంగా దొరికిపోయారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌చార్జి షికా గోయల్ సూచనతో వనపర్తి ఎస్పీ గిరిధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. సైబర్ నేరగాళ్లంతా వనపర్తి జిల్లాకు చెందిన వారేనని తెలుసుకొని ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇదిలా ఉండగా.. ఉండవెల్లి మండలం కలగోట్ల గ్రామానికి చెందిన పరశురాముడు ఇన్‌స్టాగ్రాం లింక్ ఓపెన్ చేయడంతో రూ.1.96 లక్షలు, అదే మండలకేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు రూ.85 వేలు, బైరాపురం గ్రామానికి చెందిన సంజీవకుమార్ రూ.99 వేలను సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి పోగొట్టుకున్నారు.

***ఫేక్ మెసేజ్‌లను ఓపెన్ చేయొద్దు..***

సైబర్ నేరాలు అధికమవుతున్నాయి. నేరగాళ్లు పంపిన లింక్‌లను క్లిక్ చేయగానే డబ్బులను మాయం చేస్తున్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేస్తే ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు వంటివి చెప్పొద్దు. ఆన్‌లైన్ గేమ్ పేరిట సైతం మోసాలు జరుగుతున్నాయి.

*- వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్ డీఎస్పీ*



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

# మూడేండ్లలో పూర్తి చేస్తాం

- రూ.4,400కోట్లతో ఎస్ఎల్‌బీసీ పనులు వేగవంతం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పరిశీలన, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

అచ్చంపేట రూరల్, సెప్టెంబర్ 20 : ఎస్ఎల్‌బీసీకి రూ.4,400కోట్ల నిధులు మంజూరు చేసి మూడేండ్లలో పనులు పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి వద గల టన్నెల్-1ను పరిశీలించారు. అనంతరం నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీకి నెలవారీగా క్రమం తప్పకుండా రూ.14 కోట్లను విడుదల చేసి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. డిండి, నక్కల గండి, అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పూర్తి చేస్తామన్నారు. నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందిస్తామన్నారు. మిషన్ రిపేర్ కోసం అమెరికా నుంచి బేరింగ్ తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా తక్షణమే రూ.42కోట్లను విడుదల చేశామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2027 సెప్టెంబర్ 20 నాటికి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. డిండి ప్రాజెక్టుపై ప్రతివారం ఇరిగేషన్ సెక్రటరీ సమీక్షించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట, దేవరకొండ నియోజకవర్గాల మధ్య హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని, డిస్ట్రిబ్యూటరీ-1 ద్వారా రైతులకు సాగు నీరు అందించాలన్నారు. పరిపాలన అనుమతులు వచ్చిన అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్‌కు శంకుస్థాపన చేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 150 గొర్రెలు మృత్యువాత

- మందపై నుంచి వెళ్లిన వోల్వో బస్సు

ఊట్కూరు, సెప్టెంబర్ 20 : మహారాష్ట్రకు చెందిన వోల్వో బస్సు ఢీకొట్టగా 150 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన కర్ణాటక రాష్ట్రం రాయిచూరు శివారులో చోటుచేసుకున్నది. గొర్రెల కాపరుల కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం ఓబులాపూర్‌కు చెందిన అనంతమ్మ, పూజారి శ్రీనివాస్, నారాయణపేటకు చెందిన మల్లేశ్ గొర్రెల పెంపకంతో జీవనం పొందుతున్నారు. కొన్నాళ్ల కిందట గొర్రెల మందను మేపుకొంటూ కర్ణాటకలోని రాయిచూరుకు తీసుకెళ్లారు. శుక్రవారం మాన్వి హైవే రోడ్డుపై గొర్రెలను దాటిస్తుండగా, తెల్లవారుజామున 3:30 గంటలకు హైదరాబాద్ నుంచి బెంగళూర్ వైపు వెళ్తున్న వోల్వో బస్సు గొర్రెల మందపై నుంచి వెళ్లడంతో 150 గొర్రెలు శరీర భాగాలు ఛిద్రమై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మరో 25 గొర్రెలు తీవ్రంగా గాయపడి కోలుకోలేని స్థితిలో ఉన్నాయని కాపరులు వాపోయారు. డ్రైవర్ అజాగ్రత్తతో బస్సును గొర్రెలపై నుంచే వెళ్లడంతో మృత్యువాత పడినట్లు తెలిపారు.



మృతిచెందిన గొర్రెలు

ఘటనపై రాయిచూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

***ఎమ్మెల్యే శ్రీహరి పరామర్శ..***

ఓల్వో బస్సు ఢీ కొట్టిన ఘటనకు సంబంధించి గొర్రెల కాపరులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు. పూర్తి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని ధైర్యం చెప్పారు.

# మద్యం మత్తులో మహిళలపై దాడి



గాయపడిన మహిళలు అంజమ్మ, ప్రమీల

- పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు
- రూ.5వేలకు రాజీ కుదిర్చేందుకు గ్రామ పెద్దల ప్రయత్నం

అమరచింత, సెప్టెంబర్ 20 : మద్యం మత్తులో ఇంటి ముందు కూర్చున్న ఇద్దరు మహిళలపై చెప్పలేని భాషతో దుర్భాషలాడుతూ కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చగా, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన అమరచింత మండలం కృష్ణంపల్లిలో చోటుచేసుకున్నది. కృష్ణంపల్లికి చెందిన బాధిత మహిళలు అంజమ్మ, ప్రమీల వారి ఇంటి వద్ద ఉండగా, అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన కుక్కల చంద్రయ్య ఫుల్లుగా మద్యం తాగి మహిళలను నోటికొచ్చిన బూతులన్నీ తిడుతూ ఒంటిపై బట్టలను సైతం చించి కట్టెలతో దాడి చేశారని బాధిత మహిళలు వాపోయారు. చుట్టుపక్కల ఉన్న వారు చూస్తున్నారే తప్పా ఒక్కరూ విడిపించలేదన్నారు. దాడిలో చూయించుకోలేని చోట గాయాలు కాగా, మహిళా కానిస్టేబుల్ చూసి బిత్తరపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాక ఊర్లోని పెద్ద మనుషులు వచ్చి రూ.5వేలు తీసుకొని కేసు వెనక్కి తీసుకొని రాజీ కావాలని చెబుతున్నారన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కన్నకొడుకే కాలయముడు

- గొడ్డలితో కుటుంబసభ్యులపై దాడి
- తండ్రి మృతి, తప్పించుకున్న తల్లి

బాలానగర్ (రాజాపూర్), సెప్టెంబర్ 20 : కన్న కొడుకే తల్లిదండ్రుల పాలిట కాలయముడయ్యాడు. గొడ్డలితో అర్ధరాత్రి కుటుంబ సభ్యులపై దాడి చేయగా, తండ్రి మృతిచెందగా.. తల్లి తృటిలో ప్రాణాలతో బయటపడిన ఘటన రాజాపూర్ మండలం రాయపల్లిలో చోటుచేసుకున్నది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి నారాయణ పారిశ్రామిక వాడలో దినసరి కూలీగా పనిచేస్తుండువాడు. ఆయన భార్య చంద్రకళ గ్రామంలో కూలీ పనులకు వెళ్తుంది. కూతురు పెళ్లై అత్తారింటికి వెళ్లిపోగా, కుమారుడు నదేశ్ ఆనంద్ (నందు)ఇంటి దగ్గరే ఉంటున్నాడు. పదో తరగతి వరకు చదువుకున్న నదేశ్ ఏ పనీ చేయకుండా ఇంటి దగ్గరే ఉంటూ తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులు ఖర్చుచేస్తూ కాలక్షేపం చేసేవాడు. గురువారం రాత్రి అందరూ భోజనాలు చేసి నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 11:30 గంటల ప్రాంతంలో నిద్రలేచిన నందు తలుపు పక్కన ఉన్న గొడ్డలిని తీసుకొని నిద్రలో ఉన్న తండ్రి నారాయణ కంఠంపై మూడుసార్లు కొట్టాడు. భర్త అరుపులతో నిద్రలేచిన చంద్రకళ కొడుకును వారించే ప్రయత్నం చేయగా, గొడ్డలితో ఆమెపై కూడా దాడిచేసేందుకు ప్రయత్నించాడు. ఆమె తప్పించుకుని బయటకు వెళ్లి కేకలు వేయడంతో పక్కనే ఉన్న ఆమె మరిది రవి, ఇతర కుటుంబ సభ్యులు వచ్చారు. రక్తంతో తడిసిన గొడ్డలిని చేత్తోపట్టుకున్న నందును చూసిన వారు గట్టిగా అరవడంతో నందు గొడ్డలితో బాబాయి రవిపై దాడిచేసేందుకు వెళ్లాడు. వారు తప్పించుకోగా, గొడ్డలి చేతులో పట్టుకొని పొలాల్లోకి వెళ్లిపోయాడు. అనంతరం రక్తపు మడుగులో ఉన్న నారాయణను కుటుంబ సభ్యులు ఆటోలో జడ్చర్ల దవాఖానకు తీసుకువెళ్లగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్సై రవి పరిశీలించారు. శుక్రవారం నారాయణ భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



నారాయణ (ఫైల్)



ఉద్యమ సమయంలో, తెలంగాణ ఏర్పడ్డాక తన పాటలతో ఉర్రూతలూగించిన సాయిచంద్ జయంతి వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఊర్కొండ మండలకేంద్రంలోని ప్రధాన కూడలిలో సాయిచంద్ సతీమణి, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్ హాజరై కేక్ కట్ చేశారు.



14 రోజుల పాటు భక్తులతో పూజలందుకున్న ఏకదంతుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. మహిళల కోలాటాలు, చిన్నారుల కేరింతలు, డీజే చప్పుళ్ల మధ్య శోభాయాత్ర చేపట్టారు. వినాయక మండపాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. కౌకుంట్ల మండలకేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన మట్టిగణపతిని పురవీధుల మీదుగా ఘనంగా ఊరేగించారు. స్వామి నామాలతో భజనలు చేస్తూ ఊరి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.





బకెట్లతో నీటిని మోసుకొస్తున్న విద్యార్థినులు, ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకునేందుకు బకెట్లను బారులుగా ఉంచిన స్టూడెంట్స్

# నీటి తంటా

- మానవపాడు కస్తూర్బాలో తీవ్ర కష్టాలు
- ఐదు రోజులుగా మిషన్ భగీరథ జలాలు బంద్
- ఇక్కట్లు పడుతున్న 450 మంది విద్యార్థినులు


పట్టించుకోని అధికార యంత్రాంగం

మానవపాడు, సెప్టెంబర్ 20 : పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు కేసీఆర్ సర్కారు మానవపాడులో కస్తూర్బాగాంధీ పాఠశాలను ఏర్పాటు చేసింది. అన్ని వసతులతో పాఠశాలను ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో విద్యార్థులకు కనీస సౌకర్యమైన నీళ్లు కూడా లేని పరిస్థితి నెలకొన్నది. ఐదు రోజులుగా నీళ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ ద్వారా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసినా అవి కూడా రాకపోవడంతో సమస్య మొదటికొచ్చింది. 450 మంది విద్యార్థులున్న పాఠశాలలో నీళ్లు లేకపోతే ఎలాగని విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. ఆడపిల్లలు నీళ్లు లేకపోతే ఎలా కాలకృత్యాలు తీర్చుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ఎస్‌వోను వివరణ కోరగా, నీటి సమస్య ఏర్పడిన మాట వాస్తవేమనని అన్నారు. పాఠశాలకు సరఫరా చేసే బోరు మోటరు ద్వారా పంచాయతీ కార్యదర్శి గ్రామానికి నీటిని సరఫరా చేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు చెప్పామన్నారు.

## అబ్బురపర్చిన
# వైద్య విజ్ఞాన సదస్సు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 20 : ఎస్వీఎస్ దవాఖాన, మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సు అబ్బురపరిచింది. జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో ఉన్న ఎస్వీఎస్ దవాఖాన, మెడికల్ కళాశాల ప్రారంభించి 25ఏండ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును మెడికల్ కళాశాల డైరెక్టర్ కృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 23వ తేదీ వరకు సదస్సు కొనసాగుతుందని, మొత్తం 25 డిపార్ట్‌మెంట్ల నుంచి వైద్యులు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం వైద్యులు మానవ శరీరంలోని అవయవాలు, వైద్య సేవలపై అవగాహన కల్పించారు. కల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై దాడి చేసిన నిందితుడిని ఉరితీస్తున్నట్లు మెడికల్ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, రెసిడెన్సీ డైరెక్టర్ రాంరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జోషి తదితరులు పాల్గొన్నారు.










వైద్య విజ్ఞానిక సదస్సును ప్రారంభించిన ఎస్వీఎస్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, సందర్శనకు ఉంచిన మృతశిశువులు, డాక్టర్ అభయపై జరిగిన హత్యాచార నేరస్తులకు ఉరిశిక్ష విధించాలంటూ ప్రదర్శన